పరామర్శ, ఆర్థిక సాయం

రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని వెంగళరావునగర్‌కు చెందిన ఝాన్సీ ఇంట్లో వంట చేస్తుండగా ఈ నెల 15న ఒక్కసారిగా ప్రెషర్ కుక్కర్ పేలిపోయింది. ఈ ప్రమాదంలో ఇంటి రేకులు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ధ్వంసమైన ఇంటి పరిస్థితిని అడిగి తెలుసుకుని, బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ పర్యటనలో ఎమ్మెల్యే వెంట బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణగౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అత్తెల్లి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిశోర్, మల్లేశ్, కస్తూరి, రాజు, సాయినాథ్, గణేశ్, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

– బేగంపేట్, జనవరి 17

దరఖాస్తులు ఆహ్వానం

కాచిగూడ, జనవరి 17: నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు గల ఫ్యాషన్ డిజైనింగ్ పీజీ, డిప్లామా, ఫ్యాషన్, టెక్నాలజీ కోర్సులకు యువతులు, మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు నిఫ్ట్ డైరెక్టర్ కె.రాముయాదవ్ తెలిపారు. బుధవారం నిఫ్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఈ వృత్తి విద్యా కోర్సులకు అధిక డిమాండ్ ఉందన్నారు. ఆసక్తిగల వారు 9030610011/ 55లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్డు ఆక్రమణలను తొలగించాలి

- స్థానికుల అభ్యర్థన మేరకు పార్కు అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- జీహెచ్ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశం
- స్థానికులతో కలిసి మోతీలాల్ నెహ్రూనగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

కాలనీ నివాసితులతో కలిసి సమస్యలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, జనవరి 17: బేగంపేట్ డివిజన్‌లోని మోతీలాల్ నెహ్రూనగర్ నివాసితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించేందుకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ బుధవారం సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే తలసానికి కాలనీ నివాసితులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను చూపించారు. ముఖ్యంగా బేగంపేట్ ప్రధాన రహదారి నుంచి కాలనీలోకి వచ్చే మార్గంలో మొదటి మూల నుంచే ఫుట్‌పాత్, రోడ్డు ఆక్రమణలు ప్రారంభమవుతాయని, ఈ రెండు మలుపుల వద్ద ప్రైవేట్ వ్యాపారస్తులు తమ వద్దకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ సౌలభ్యం కోసం శాశ్వత నిర్మాణాలు చేపట్టారన్నారు. మరో వైపు కాలనీల్లోని అంతర్గత రహదారుల్లో సైతం గుర్తు తెలియని వ్యక్తులు తమ వాహనాలు పార్క్ చేసి వెళ్లిపోతున్నారన్నారు. ఈ కారణంగా తాము కాలనీలో రాకపోకలు సాగించాలంటే ఇబ్బందికర పరిస్థితులున్నాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో అక్కడే ఉన్న ట్రాఫిక్ పోలీస్, టౌన్ ప్లానింగ్ అధికారులతో తక్షణమే రోడ్డు ఆక్రమణలను తొలగించాలని, అదే సమయంలో అక్రమంగా పార్క్ చేసిన వాహనాలకు సంబంధించి కూడా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కాలనీలోని పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీల్లో తమ సౌలభ్యం కోసం ఓ స్టోర్ రూమ్, చక్కటి పాత్ వే, పచ్చదనాన్ని పెంపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ అధికారులను వెంటనే పార్కులో స్థానికులు కోరిన పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట్ కార్పొరేటర్ మహేశ్వరి శ్రీహరి, జల మండలి సీజీఎం ఎం.ప్రభు, డీజీఎం శశాంక్, జీహెచ్ఎంసీ డీఈ సంతోశ్, మోతీలాల్ నెహ్రూనగర్ నివాసితుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గౌర శ్రీనివాస్, విశాల్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

మురళీధర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు

ఎమ్మెల్యే పద్మారావు పరామర్శ

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 17: ఇటీవల అనారోగ్యంతో మరణించిన బౌద్ధనగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత యంజాల మురళీధర్ కుటుంబసభ్యులను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మురళీధర్ నివాసంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మురళీధర్ చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. మురళీధర్ ఉద్యమ సహచరుడని, ఆయనను కోల్పోవడం బాధాకరమన్నారు.అలాగే స్వల్ప అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ నాయకుడు సాయియాదవ్‌ను సైతం పద్మారావు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కంది శైలజ, మాజీ కార్పొరేటర్ నారాయణ, నాయకులు రాజేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

లాల్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే లాస్య నందిత

ఎమ్మెల్యే లాస్యనందితకు వినితిపత్రం ఇస్తున్న నియోజకవర్గానికి చెందిన ఆర్పీలు

వైద్యులు రోగులకు అందుబాటులో ఉండాలి

- తిరుమలగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే లాస్య నందిత

బొల్లారం/కంటోన్మెంట్, జనవరి 17: కంటోన్మెంట్ నియోజకవర్గం ఏడో వార్డు పరిధి తిరుమలగిరి లాల్‌బజార్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే లాస్య నందిత సందర్శించి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ముందు చేపట్టే షెడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ మేరకు వైద్యులను ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. నిరుపేద రోగులకు నిరంతరం అందుబాటులోని ఉండాలని వైద్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎమ్‌హెచ్ఓ రాజకుమారి, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు నివేదిత, బోర్డు మాజీ సభ్యులు శ్యాం కుమార్, డివిజన్ అధ్యక్షుడు తేజ్‌పాల్, సీనియర్ నాయకులు కేబీ శంకర్ రావు, శత్రు మధు, వేణు, యశ్వంత్, మార్టిన్, రాజిరెడ్డి, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్పీలకు న్యాయం చేయాలి

రిసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లకు ప్రభుత్వం న్యాయం చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత అన్నారు. ఈ మేరకు బుధవారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన ఆర్పీలు కార్ఖానాలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే లాస్యనందితను మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆర్పీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న ఆర్పీలకు ప్రభుత్వం తగిన న్యాయం చేయాలని ఎమ్మెల్యే లాస్యనందిత విజ్ఞప్తి చేశారు.

ఇఫ్లూను సందర్శించిన జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు

ఇంగ్లీష్ అండ్ ఫారెన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ)ను జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయీద్ షహజాదీ బుధవారం సందర్శించి, అధికారులు, అధ్యాపకులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇఫ్లూ యాక్టింగ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సురభి భారతి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరసింహారావు, డీన్ ప్రొఫెసర్ శాంసన్ థామస్ తదితరులు పాల్గొన్నారు. – ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 17

'ఇండో - నేపాల్' పోటీల్లో భారత్ జయకేతనం

నేపాల్‌లోని పోఖరా స్టేడియంలో జరిగిన 'ఇండో - నేపాల్'ఆరో ఇంటర్నేషనల్ చాంపియన్‌షిప్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్ విభాగాల్లో భారత జట్టు విజయాలు సాధించింది. బ్యాడ్మింటన్ సింగిల్స్, డబుల్స్‌లో రెండో స్థానం, బాస్కెట్ బాల్‌లో మొదటి స్థానంలో నిలిచారు. గెలుపొందిన జట్టులో హైదరాబాద్‌కు చెందిన సాయిరామ్, వజాహత్ ఉన్నారు. బాస్కెట్‌బాల్ జట్టుకు తెలంగాణ క్రీడాకారిణి గాయత్రి సారథ్యం వహించారు. – అడ్డగుట్ట, జనవరి 17

సీతారాముల కల్యాణంలో తాళిఘట్టం ప్రక్రియలో పాలుపంచుకున్న మాధవీలత

వారం రోజులపాటు సీతారాముల కల్యాణోత్సవాలు

చార్మినార్, జనవరి 17:అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని చార్మినార్ సమీపంలోని మామజుమ్లాపాతక్ చార్ కమాన్ సమీపంలో కొలువుతీరిన మహావీర్ దళ్ దేవాలయంలో సీతారాముల వివాహ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లతా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6 రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన సీతారాముల కల్యాణం మొదటిసారిగా చార్మినార్ నియోజకవర్గంలో చేపట్టినట్లు లతా మా ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్ కొంపెల్ల మాధవీలత తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరితా అగర్వాల్, పవన్ మిశ్రా, అనిల్‌బజాజ్, నీరజ్ అగర్వాల్, పంకజ్ అగర్వాల్, గౌరిశంకర్, రేణుసోని, సోహన్ లాల్, విష్ణు సోని, అనూప్ బన్సల్, ముఖేష్ అగర్వాల్ పాల్గొన్నారు.

20 నుంచి వయోధికులకు ఆటల పోటీలు

అమీర్‌పేట్, జనవరి 17: వయోధికులకు ఈ నెల 20 నుంచి ఆటల పోటీలు జరుగుతాయని ఖైరతాబాద్ జీహెచ్ఎంసీ సర్కిల్ ఆసరా కమిటీ ఉపాధ్యక్షులు జేఎస్‌టి శాయి ఒక ప్రకటనలో తెలిపారు. సనత్‌నగర్ మోడల్‌కాలనీ కమ్యూనిటీ హాలు ఆవరణలోని కాలనీ వయోధికుల సంఘం కార్యాలయంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనాలనుకునే వారు 60 ఏండ్ల వయసు పైబడిన వారై ఉండాలని, క్యారమ్స్ (సింగిల్స్, డబుల్స్), జనరల్ నాలెడ్జ్, టగ్ ఆఫ్ వార్, చదరంగం, మ్యూజికల్ చైర్స్, బ్రిస్క్ వాకింగ్ వంటి పోటీలు ఉంటాయని తెలిపారు. ఔత్సాహికులు తమ పేర్లను ఈ నెల 19వ తేదీ లోపు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వివరాలకు పోటీల నిర్వాహక కమిటీ ప్రతినిధులు 8977914856, 9493974300 నంబర్లలో సంప్రదించాలన్నారు.

లింక్ రోడ్డు నిర్మాణాన్ని రద్దు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 17: ఉస్మానియా యూనివర్సిటీలో నూతనంగా నిర్మిస్తున్న లింక్ రోడ్డు నిర్మాణాన్ని రద్దు చేయాలని తెలంగాణ డెమోక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్ఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఓయూలో ఇప్పటికే వందల ఎకరాల భూమి కబ్జాకు గురయ్యిందని, వర్సిటీకి ఏ రకంగానూ ఉపయోగపడని సినిమా థియేటర్లు, బార్లు, పెట్రోల్ బంక్, బస్తీలు విచ్చలవిడిగా ఓయూ భూముల్లో వెలిసాయని గుర్తు చేశారు. నూతన లింక్ రోడ్డు నిర్మిస్తే రోడ్డు అవతలి భూమి నష్టపోయే ప్రమాదముందని అనుమానం వ్యక్తం చేశారు. అకాడమిక్ వాతావరణం సైతం దెబ్బతినే ప్రమాద ముందన్నారు. తక్షణమే రోడ్డు నిర్మాణాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

తక్షణమే ఆ దుండగులను అరెస్టు చేయాలి

రవీంద్రభారతి, జనవరి 17: శేరిలింగంపల్లి ఆల్విన్‌కాలనీలో తెలంగాణ రాష్ట్ర సిద్ధాంత కర్త ఆచార్య జయశంకర్ విగ్రహాన్ని కొందరు దుండగులు తప్పుతాగి విగ్రహాన్ని ధ్వంసం చేశారని, తక్షణమే దుండగులను అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృసంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వేములవాడ మదన్‌మోహన్, గౌవర అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆలపిస్తున్న గాయకుడు శ్యామ్‌కిశోర్ షిండే

ఆకట్టుకున్న హిందీ చిత్రాల విభావరి

రవీంద్రభారతి, జనవరి 17: జాతీయస్థాయిలో జనాదరణ అణిముత్యాల్లాంటి హిందీ చిత్రాల పాటలను గాయకులు శ్రావ్యంగా ఆలపించి ఆహూతులను ఉర్రూతలూగించారు. రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో మెలోడి మ్యూజిక్ ఆర్నెస్టా హిందీ సినీ సంగీత విభావరిని ఘనంగా నిర్వహించారు. దిగ్గజ గాయకులు మహ్మద్ రఫీ, ముఖేష్, కిశోర్ కుమార్ తదితర అలనాటి గాయకుల పాటలను ప్రముఖ గాయకులు శ్యామ్‌కిశోర్ షిండే, అరుణ్‌దేవ్, ప్రియాంక, సౌమ్యాశర్మ (ముంబై) తదితరులు ప్రేక్షకాదరణ పొందిన పాటలను వారు ప్రాణం పోసేలా అద్భుతంగా ఆలపించి సభీకులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టి.రామనారాయణ శర్మ, శ్రీరామలింగేశర్మ పాల్గొని గాయకులను అభినందించారు.

రిజర్వేషన్ల పెంపునకు చర్యలు చేపట్టాలి

తెలంగాణలో త్వరలో రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం వరకు పెంచాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం నింబోలిఅడ్డాలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న దృష్ట్యా కులాల వారీగా జనాభా లెక్కలు తీసి, బీసీ రిజర్వేషన్ల పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో భూషణ్ భాస్కర్, ప్రశాంత్‌నిమ్‌కర్, ప్రదీప్ గౌడ్, కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు.

– కాచిగూడ, జనవరి 17

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

- తిరుమలగిరి ప్రాంతీయ రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి

రవాణా కార్యాలయంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

బొల్లారం, జనవరి 17: ట్రాఫిక్ రూల్స్‌ని పాటించి–రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తిరుమలగిరి ఆర్టీఓ అధికారి వి.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం తిరుమలగిరి ఆర్టీఓ కార్యాలయంలో అధికారులతో కలిసి ఆయన వాహనదారులకు రోడ్డు ప్రమాదాలు–ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రహదారి ప్రమాదాల వలన ఎంతో మంది ప్రజలు మరణించడంతో పాటు, క్షత గాత్రులవుతున్నారని తెలిపారు. మనదేశంలో సుమారు ప్రతి ఏట 5 లక్షల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఈ రోడ్డు ప్రమాదాల వల్ల 1 లక్ష 50 వేల మంది చనిపోతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో 20 వేల వరకు రోడ్డు ప్రమాదాలు సంభవిస్తే, 6 వేల మంది వరకు చనిపోతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఓ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచే ప్రగతి మహావిద్యాలయ గోల్డెన్ జూబ్లీ

శ్రీగుజరాతి ప్రగతి సమాజ్ ప్రగతి మహావిద్యాలయ డిగ్రీ కళాశాల గో ల్డెన్ జూబ్లీ వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కమిటీ చీఫ్ ప్యాట్రన్ మహేశ్ పటేల్, చైర్మన్ గోవింద్ దాస్ షా

సుల్తాన్‌బజార్, జనవరి 17: ఎంతో మంది విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థానంలో నిలిచేలా తీర్చిదిద్దిన ప్రగతి మహా విద్యాలయ డిగ్రీ కళాశాల 50 వసంతాలు పూర్తి చేసుకొని స్వర్ణోత్సవ వేడుకలకు సిద్ధమైంది. ఈ వేడుకలను మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు గోల్డెన్ జూబ్లీ కమిటీ చీఫ్ ప్యాట్రన్ మహేశ్ ఎస్ పటేల్ పేర్కొన్నారు. బుధవారం హనుమాన్‌టేక్డీలోని ప్రగతి మహావిద్యాలయ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన స్వర్ణోత్సవ వేడుకల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లా డుతూ.. 18, 19, 20వ తేదీల్లో ఈ స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. 18న సుల్తాన్‌బజార్ ఏసీపీ ఏ చిన్న బాలగంగిరెడ్డి, ఓయు కామర్స్ డిపార్ట్‌మెంట్ సీనియర్ ప్రొఫెసర్ వి అప్పారావులు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభిస్తారని అన్నారు. 19వ తేదిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీ నారాయణలు ముఖ్య అతిథులుగా విచ్చేస్తారని అన్నారు. 19న ముగింపు వేడుకలకు కేంద్ర పశు సంవర్ధక, మత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాల, రాష్ట్ర పంచాయితీ రాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి ముఖ్య అతిథులుగా విచ్చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ జూబ్లీ కమిటీ చైర్మన్ శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్ అధ్యక్షుడు గోవింద్ దాస్ షా, కో చైర్మన్ గుజరాతి సమాజ్ సంయుక్త కార్యదర్శి, పీఎంవీ కరస్పాండెంట్ గోపాల్ ఓ పటేల్, సలహాదారులు శ్రీ గుజరాతి ప్రగతి సమాజ్ కార్యదర్శి రాహుల్ చెడా, కళాశాల ప్రిన్సిపాల్స్, తదితరులు పాల్గొన్నారు.

భవ్యంగా రామనామాన్ని స్మరిద్దాం

సమావేశంలో మాట్లాడుతున్న చార్మినార్ బాగ్ కన్వీనర్ మజ్జిగ మహేశ్

చార్మినార్, జనవరి 17: రామ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పాతనగరంలోని ప్రతి బస్తీ ఆలయంలో ఘనంగా నిర్వహించడానికి కార్యాచరణ కొనసాగిస్తున్నామని విశ్వహిందూ పరిషత్ చార్మినార్ బాగ్ కన్వీనర్ మజ్జిగ మహేశ్ తెలిపారు. బుధవారం శాలిబండ రాంభక్షి బండ ప్రాంతంలోని వనవాస రామాలయ దేవాలయంలో కోకన్వీనర్ విశాల్ ప్రసాద్‌తో కలిసి ఆయన మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణాన్ని పురస్కరించుకుని చార్మినార్ బాగ్‌లోని 54 బస్తీల్లో 96417 ఇండ్లకు అంక్షితలను అందజేయడంతో మొదటి ఘట్టం పూర్తయిందన్నారు. రెండో ఘట్టంలో ఈ నెల 22న అయోధ్యలోని భవ్య రామ మందిరంలో రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ చేయబోతున్న తరుణాన్ని పురస్కరించుకుని 54 బస్తీల్లోని స్థానిక దేవాలయాల్లో ప్రత్యేక భక్తి కార్యక్రమాలను కొనసాగించనున్నామని తెలిపారు. అదే రోజున ప్రతి కుటుంబం సాయంత్ర సమయంలో 5 దీపాలు వెలిగించాలని, 500 ఏండ్లుగా ఆలయ నిర్మాణం కోసం జరుగుతున్న పోరాటానికి ఈ దీపాలు ప్రతీకగా నిలవనున్నాయని తెలిపారు. ఈ రామ జ్యోతులను వెలిగిస్తూ రామున్ని స్మరించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వీహెచ్‌పీ సభ్యులు ముఖేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా థియేటర్ వర్క్‌షాప్ శిబిరం

బన్సీలాల్‌పేట, జనవరి 17: టీమ్ నిషుంబిత ఈ ఏడాదితో 30 ఏండ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నిషుంబిత స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో ఉచితంగా థియేటర్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నట్లు ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహన్ హోలిగొండి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం 30 రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫిబ్రవరి 1 నుంచి మార్చి 1వ తేదీ వరకు ఈ వర్క్‌షాప్ ఉంటుందని ఆయన తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో నటన, దర్శకత్వం, స్క్రిప్ట్ రైటింగ్, డాన్స్, మైమ్ యాక్టింగ్ తదితర స్కిల్స్‌ను నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పాల్గొనే వారు కనీసం 15 ఏండ్లు పైబడి ఉండాలని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో పాల్గొనాలనుకునే ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27, 28 తేదీల్లో అభ్యర్థుల ఎంపిక జరుగుతుందన్నారు. వివరాలను 9971268729, 9849256440 వాట్సప్ నంబర్లకు పంపగలరన్నారు. సినిమా, టీవీ, నాటక రంగాల్లో ఆసక్తి ఉండి, నటన, దర్శకత్వం తదితర వాటిలో స్కిల్స్ పెంచుకోవాలనుకునే వారికి సదావకాశమని పేర్కొన్నారు.

పట్టాలు దాటుతుండగా..

మారేడ్‌పల్లి, జనవరి 17: పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని ఓ వ్యక్తిని రైలు ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు కథనం ప్రకారం.. మౌలాలి–చర్లపల్లి రైల్వే స్టేషన్ల మధ్యన బుధవారం గుర్తు తెలియని (35–40 ఏండ్ల) ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అందరికీ రిజర్వేషన్లు

కవాడిగూడ, జనవరి 17: గురుకుల బోర్డు వెలువరించిన అన్ని నోటిఫికేషన్లలో సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి మహిళలకు సమాంతర రిజర్వేషన్లు అమలు చేయాలని గురుకుల ఉపాధ్యాయ అభ్యర్థులు శ్రీను కొండ్రపల్లి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు.